క్లుప్తంగా

అచ్చమాంబ పేరంటాల గ్రామోత్సవం



అచ్చమాంబ పేరంటాలు, లింగమనాయుడు దంపతుల గ్రామోత్సవం

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం పొంగూరు మాలిచేలో కొలువైన అచ్చమాంబ పేరంటాలు, వెంగమనాయుడు దంపతులకు మండలంలోని భీమవరంలో సోమవారం రాత్రి మంగళవారం ఉదయం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. గంగొపెట్టి, పాలవెల్లిలకు విశేష పుష్పాలంకరణ చేశారు. మహిళా భక్తులు, అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు మంగళ హారతులతో నైవేద్యాలు సమర్పించారు. ఆలయం పూజారి, పాశర్లపూడి వెంకటేశ్వరశర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

ఉపాధి పనుల పరిశీలన



నందవరంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ సునీల్‌కుమార్

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం పొంగూరుకండ్రిక, నందవరం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీడీ సునీల్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఉపాధి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్లతో మాట్లాడుతూ రోజు కూలి రూ.272 వంతున కూలీలకు అందేలా పనులు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు వైద్య పరీక్షలు



అంగన్‌వాడీ పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

చేజర్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మండలంలోని చేజర్ల, చిత్తలూరు పీహెచ్‌సీల్లో పాదలకూరు చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ మల్లికార్జున్ బరువు తక్కువ ఉన్న పిల్లలను పరీక్షించి మందులు అందజేశారు. చిత్తలూరులో ఇద్దరిని, చేజర్లలో నలుగురిని ఎన్ఆర్‌సీకి (న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్)కు రెఫర్ చేశారు. చిత్తలూరులో 51, చేజర్లలో 80 మంది పిల్లలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రమీలారాజకుమారి నవీన్‌కుమార్‌రెడ్డి, ఎన్.జ్యోతి, పవన్‌కుమార్‌రెడ్డి, సూపర్‌వైజర్ సుప్రజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎస్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించి అభినందిస్తున్న నాయకులు

ఉదయగిరి: మండలంలోని అప్పసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమంలో భాగంగా జెడ్పీటీసీ మోది రామాంజనేయులు, సర్పంచ్ చేజర్ల నాగరత్నమ్మ మంగళవారం ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా నాడు-నేడు పథకాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి ప్రభుత్వ పాఠశాలలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దిరన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సుభాని, మాజీ సర్పంచ్ వాకా సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సైకి సర్పంచ్‌ల సన్మానం



ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

ఉదయగిరి: ఉదయగిరి ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డిని మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని పలువురు సర్పంచ్‌లు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. శకునాలపల్లి సర్పంచ్ కల్లూరు వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సర్పంచ్‌లు సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, కొల్లుబోయిన కృష్ణ, గానుగపెంట ఓబుల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నారపరెడ్డి ఏడుకొండలు, రమణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో సర్వతోముఖాభివృద్ధి



కరటంపాడులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- గత ప్రభుత్వంలో మేనిఫెస్టో కాగితాలకే పరిమితం
- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రజలు సర్వతోముఖాభివృద్ధి సాధిస్తున్నారని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కరటంపాడు సచివాలయం పరిధిలో మంగళవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కరటంపాడులోని ముస్లింవీధి, తూర్పుబజారు తదితర ప్రాంతాల్లో అధికారులు, నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసి అందజేసిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ప్రతి ఇంటికి అందించిన లబ్ధిని తెలియజేశారు. లబ్ధిదారులు పలువురు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల లబ్ధి పొందామని, గతంలో ఏ ప్రభుత్వంలో మాకు ఇలాంటి పథకాలు రాలేదన్నారు. మళ్లీ జగన్‌కు ఓటేసి ముఖ్యమంత్రిని చేసుకుంటామని సంతోషంగా చెప్పారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలు కాగితాలకే పరిమితం చేసి మర్చిపోయేవారని, జగన్ మాత్రం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు, ఇవ్వని హామీలను కూడా నెరవేర్చి ప్రజల్లో విశ్వసనీయత పెంచుకున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను, సంక్షేమ పథకాలను కాపీ చేస్తూ ప్రతిపక్షాలు సైతం తమ మేనిఫెస్టోను ప్రకటించాయంటే జగన్ పరిపాలనను విపక్షాలు సైతం ఆమోదించినట్లుగా ప్రజలు భావిస్తున్నారన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామన్నారు. నారంపేట పారిశ్రామికవాడలో వ్యవసాయ వ్యర్థాలతో నడిచే పరిశ్రమ ఏర్పాటుకు త్వరలోనే శంకుస్థాపన చేస్తామని, ఒక్కో ఎకరాకు రూ.5 వేల వరకు రైతులకు ఆదాయం వచ్చేలా ఈ పరిశ్రమ నడుస్తుందన్నారు. నిరుద్యోగులకు ప్రతి మూడు నెలలకు జాబ్‌మేళా నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలోని 63 సచివాలయాల పరిధిలో 122 రోజుల పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి వందలాది సమస్యల పరిష్కారానికి కృషి చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో కరటంపాడు సచివాలయం పరిధిలో రూ.2 కోట్ల మేర అభివృద్ధి పనులు జరిగితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 4 ఏళ్ల పరిపాలనలో రూ.15 కోట్ల మేర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధులు ఖర్చు చేశామన్నారు. కరటంపాడు గ్రామస్తుల కోర్కె మేరకు సైడ్ కాలువలు, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

గార్లపాటి ఆత్మీయ సమావేశం



గార్లపాటి వేణుగోపాల్ నాయుడు తదితరులతో మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆత్మీయ సమావేశం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కరటంపాడు మాజీ ఎంపీటీసీ సభ్యుడు గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు నివాసంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మేకపాటిని గార్లపాటి శాలువాలతో సత్కరించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్రనాయుడు, ఆత్మకూరు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, ఎంపీటీసీ సభ్యులు ఖాసీం, వైఎస్సార్‌సీపీ నాయకులు రఫీ, జమీర్, తహసీల్దారు లక్ష్మీనరసింహం, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, వెలుగు ఏపీఎం వెంకమ్మ, ట్రాన్స్‌కో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు వెంకటేశ్వర్లు, నయోమి, వ్యవసాయ అధికారి కిషోర్ పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- నిందితుడు మా పార్టీ నాయకుడు కాదు
- టీడీపీ నుంచి వచ్చి పార్టీలో చేరిన కార్యకర్త మాత్రమే
- బాధితురాలికి న్యాయం జరిగే వరకు అండగా నిలబడుతాం
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పట్టణంలో చిరువ్యాపారి కరకమిట్ట పార్వతిపై దాడికి పాల్పడిన దర్శిగుంట మహేంద్రపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంలో వెనుకాడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కావలిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహేంద్ర, అతని అనుచరులు అమానుషంగా దాడి చేసి గాయపరిచిన విషయాన్ని, అవమానం తట్టుకోలేక బాధితురాలు పోలీస్‌స్టేషన్ ఎదుట పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన విషయాన్ని తెలుసుకుని ఎమ్మెల్యే చలించిపోయారు. వడ్డీ వ్యాపారం పేరుతో జరిగిన దాడి ఘటనను ఉపేక్షించేది లేదని బాధితురాలికి హామీ ఇచ్చారు. ఈ విషయంపై డీఎస్పీతో కూడా చర్చించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ మహేంద్ర వైఎస్సార్‌సీపీ నాయకుడు కాదని స్పష్టం చేశారు. గతంలో టీడీపీలో ఉండి ఆ తర్వాత వైఎస్సార్‌సీపీలో చేరిన సాధారణ కార్యకర్త మాత్రమేనని తెలిపారు. పట్టణంలో నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి మహేంద్ర కొంత మందిని భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు కూడా వస్తున్నాయన్నారు. గతంలోనే మార్కెట్ కాంట్రాక్టర్‌గా ఉన్న మహేంద్రను తప్పించి బహిరంగ వేలం ద్వారా ఇతరులకు అప్పగించినట్లు చెప్పారు. తప్పు చేసింది ఏ పార్టీ వారైనా ఉపేక్షించేది లేదన్నారు. తప్పు చేసిన వాళ్లకు శిక్ష తప్పదన్నారు. జరిగిన ఘటనపై బాధితురాలి సోదరులు ఎస్పీకి కూడా ఫిర్యాదు చేశారని వివరించారు. పోలీసులు పూర్తి స్థాయి విచారణ చేసి తప్పు చేసిన వాళ్లను కఠినంగా శిక్షించాలని కోరారు. వ్యాపార కేంద్రంగా ఉన్న కావలిలో ఇటువంటి ఘటనలు ఉపేక్షించబోమన్నారు. అత్యధికంగా వడ్డీలు వసూలు చేసినా, గూండాగిరి, రౌడీయిజం చేసినా పట్టణ ప్రజలు వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే తగిన చర్యలు చేపడుతామని తెలిపారు.

మసీదులు, దర్గాలకు మహర్దశ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి నియోజకవర్గంలోని మసీదులు, దర్గాలకు అవసరమైన మరమ్మతులు పూర్తి చేసి సుందరంగా తీర్చిదిద్దేందుకు కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ముస్లిం సంఘాల పెద్దలు ఎమ్మెల్యేని కలిసి 'హర్ దిల్‌మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్ కే సాథ్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, వక్ఫ్‌బోర్డు సభ్యులతో మసీదులు, దర్గాల పరిస్థితిపై ఎమ్మెల్యే చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గంలోని మసీదులు, దర్గాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మతపెద్దలు, వక్ఫ్‌బోర్డు సభ్యులు కమిటీలుగా ఏర్పడి మరమ్మతులు అవసరమైన దర్గాలు, మసీదులు గుర్తించి ప్రతిపాదనలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు షాహుల్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతులకు గుర్తింపు కార్డులు

బిట్రగుంట: కౌలు రైతులకు త్వరితగతిన గుర్తింపు కార్డులు మంజూరు చేసేలా గ్రామ రెవెన్యూ అధికారులు చొరవ చూపాలని డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డుల మంజూరుపై వీఆర్వోలతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుర్తిపు కార్డుల ప్రాముఖ్యతపై రైతులకు విస్తృతంగా అవగాహన కలిగించాలని సూచించారు. గుర్తింపు కార్డులతో కౌలు రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. మండల వ్యవసాయాధికారిణి విజయలక్ష్మి పాల్గొన్నారు.


మోదీతోనే దేశాభివృద్ధి

జలదంకి: మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ అధ్యక్షుడు జలదంకి మండల మారెళ్ల బ్రహ్మారెడ్డి అన్నారు. మండలంలోని చింతలపాళెంలో మంగళవారం బీజేపీ తొమ్మిదేళ్ల పాలన విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి కోటిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కాలం బుజ్జిరెడ్డి, చల్లా హనుమారెడ్డి, కంచర్ల శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓగా బాధ్యతల స్వీకరణ

కొండాపురం: స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం కొండాపురం మండల ఎంఈఓ-2గా వీ.ఆనందరావు బాధ్యతలు స్వీకరించారు. ఉదయగిరి మండలం అప్పసముద్రం పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. రెండో ఎంఈఓ ఆనందరావు మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ఇద్దరు ఎంఈఓలను నియమించిందన్నారు. ఒకరు అకడమిక్ పరంగా, మరొకరు అడ్మినిస్ట్రేషన్ పరంగా విధులు నిర్వహిస్తామన్నారు.

గేదెల పరిహారంలో 'దేశం' నాయకుల కక్కుర్తి



మృతి చెందిన పాడి గేదె వద్ద తిరుపాలు దంపతులు, పిల్లలు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ఈనెల 13న మర్రిపాడు మండలం పడమటినాయుడుపల్లి మజరా అనంతపురంలో లోకేష్ యువగళం యాత్ర విడిది చేసిన ప్రాంతంలో పారబోసిన మిగిలిపోయిన ఆహార వ్యర్థాలు తిని మృతి చెందిన గేదెలకు పరిహారం అందజేయడంలో ఆ పార్టీ నేతలు కక్కుర్తికి పాల్పడ్డారు. అదే గ్రామానికి చెందిన పాడి రైతులు ఇరుపోతు శ్రీనివాసులు, పాళెం చిన్నా, వనం తిరుపాలు మూడు గేదెలు చనిపోయిన విషయం తెలిసిందే. మరో రెండు గేదెలు అస్వస్థతకు లోనయ్యాయి. ఈ విషయం పత్రికల్లో ప్రచురితం కావడంతో లోకేష్ పాదయాత్ర నిర్వహించిన నాయకులు బాధిత రైతులకు పరిహారంగా ఇవ్వమని రూ.లక్ష పడమటినాయుడుపల్లికి చెందిన టీడీపీ నాయకులకు అందజేశారు. అయితే గేదెలు చనిపోయి కుటుంబ జీవనాధారం కోల్పోయిన వనం తిరుపాలుకు చిల్లిగవ్వ కూడా ఇవ్వకుండా స్థానిక టీడీపీ నేత రూ.లక్ష దిగమింగారని బాధితులు మంగళవారం మర్రిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పడమటినాయుడుపల్లికి చెందిన వనం తిరుపాలు మాట్లాడుతూ తనకు భార్య, ఆరుగురు బిడ్డలు ఉన్నారని, పాడి గేదెను పోషించుకుంటూ పాల ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబ పోషణ చేసుకుంటున్నానని తెలిపారు. టీడీపీ మరీ ఇంత కక్కుర్తిగా వ్యవహరించి పాడి గేదెను నష్టపోయిన తిరుపాలుకు ఆర్థిక సాయం అందకుండా ద్రోహం చేయడంపై గ్రామస్తులు సైతం దేశం నాయకుల తీరును ఎండగడుతున్నారు.

తొమ్మిది వేల గృహాలతో ఒక ఊరే నిర్మాణం

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మునునూరు జగనన్న మెగా లేఅవుట్‌లో నిర్మాణాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పట్టణంలోని ముసునూరు సమీపంలోని జగనన్న లేఅవుట్‌లో తొమ్మిది వేల గృహాలతో ఒక ఊరే నిర్మాణమవుతున్నట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. జగనన్న మెగా లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. నిర్మాణాల నాణ్యత, అంతర్గత రహదారులు, విద్యుదీకరణ పనులు, లేఅవుట్‌లో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చేపడుతున్న చర్యలను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా లేని విధంగా ముసునూరు వద్ద జగనన్న మెగా లేఅవుట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ లేఅవుట్‌లో తొమ్మిది వేల ఇళ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. త్వరలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా త్వరలోనే కాలనీని ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా సమస్యలను గుర్తించాలి

- డీఎల్‌డీఓ పద్మజ



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ పద్మజ

వరికుంటపాడు: ఈ నెల 23 నుంచి అమలు చేయనున్న జగనన్న సురక్ష ద్వారా ప్రజల సమస్యలు గుర్తించాలని కందుకూరు డీఎల్‌డీఓ పద్మజ తెలిపారు. ఆమె మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో జగనన్న సురక్ష పథకంపై పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సచివాలయాల ద్వారా తొమ్మిది రకాల సర్టిఫికెట్లు, నవరత్నాల్లో భాగంగా సంక్షేమ పథకాలు సాంకేతికంగా ఆగిపోయిన సమస్యలను సత్వరమే గుర్తించాలన్నారు. సచివాలయాల పరిధిలో వలంటీర్లతో జగనన్న సురక్ష పథకం కార్యక్రమంపై గ్రామాలలో దండోరా వేయించాలన్నారు. ప్రభుత్వ పథకాలు, సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు అధికారులు బాధ్యతగా పని చేయాలన్నారు. వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికీ తిరిగి సమస్యలను పరిష్కరించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ నెల 24 నుంచి సురక్ష పథకానికి సంబంధించిన యాప్ అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జి.వెంకటలక్ష్మమ్మ, ఎంపీడీఓ విజయభాస్కర్‌రావు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పథకంపై అవగాహన

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలంలోని సచివాలయం-1, -2లో జగనన్న సురక్ష పథకం పంచాయతీ కార్యదర్శులు, విద్య, సంక్షేమ సహాయ అధికారులకు మంగళవారం ఎంపీడీఓ మధుసూదన్‌రావు అవగాహన కల్పించారు. జూలై 1 నుంచి 29వ తేదీ వరకు మండలంలోని 16 సచివాలయాల్లో జగనన్న సురక్ష పథకం జరుగుతుందని, ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు ఎటువంటి రుసుం వసూలు చేయకుండా ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి వాళ్లకు ఏ రకమైన సర్టిఫికెట్లు అవసరమో గుర్తించి, యాప్‌లో నమోదు చేసుకుని సంబంధిత తేదీల్లో సచివాలయాల్లో ఉచితంగా అందజేసే విధంగా అందరూ కృషి చేయాలని కోరారు.

ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ రక్తదానం



రక్తదానం చేస్తున్న ఎస్‌బీఐ సిబ్బంది, విద్యార్థులు

కావలి: పట్టణంలోని రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ మంగళవారం మరోమారు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్‌బీఐ యూనియన్ నాయకులు వై.తారకనాథ్ 19వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి కొనసాగింపుగా మంగళవారం కూడా మరోమారు రక్తదాన శిబిరం నిర్వహించారు. పట్టణంలోని మూడు ఎస్‌బీఐ బ్రాంచ్‌లకు చెందిన ఉద్యోగులు, ఖాతాదారులతో పాటు విట్స్ కళాశాల విద్యార్థులు, కబడ్డీ అసోసియేషన్ సభ్యులు, కరిష్మా ఫ్యాషన్స్ సిబ్బంది, ముంగమూరుకు చెందిన యువకులు మొత్తం 40 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో స్టాఫ్ యూనియన్ రీజనల్ సెక్రటరీ సనత్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గిరిధర్, మెయిన్ బ్రాంచ్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, టౌన్‌బ్రాంచ్ సెక్రటరీ సుమన, ట్రంక్‌రోడ్ బ్రాంచ్ సెక్రటరీ భువనేశ్వరి పాల్గొన్నారు.

మహిళపై లైంగికదాడి యత్నం

చేజర్ల(సోమశిల): ఓ వివాహిత మహిళపై లైంగికదాడి యత్నం జరిగిన ఘటన అనంతసాగరం మండలంలోని వడ్డిపాళెంలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. వడ్డిపాళెంకు చెందిన వెంకటరత్నం అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన ఓ వివాహితపై కొంత కాలంగా కన్నేశాడు. సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో లోపలికి ప్రవేశించి లైంగిక దాడి యత్నానికి పాల్పడ్డాడు. దీంతో అవమానంగా భావించిన ఆమె పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సమాచారం అందుకున్న అనంతసాగరం ఎస్సై సంతోష్‌రెడ్డి మంగళవారం స్థానికంగా విచారణ చేపట్టారు. మహిళను నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నామని తెలిపారు.

పోషకాహార లోపంపై అవగాహన



పౌష్టికాహారం అందిస్తున్న డాక్టర్ మాశిలామణి

ఉదయగిరి: ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఐదేళ్లలోపు చిన్నారులకు పోషకాహార లోపానికి సంబంధించిన పరీక్షలు ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ మాశిలామణి నిర్వహించారు. కలెక్టర్ హరినారాయణన్ ఆదేశాల మేరకు ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వరికుటపాడు, తదితర మండలాలకు సంబంధించిన చిన్నారులకు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మాశిలామణి మాట్లాడుతూ వెనుకబడిన ఉదయగిరి ప్రాంతంలో కూలీనాలీ చేసుకునే కుటుంబాలకు చెందిన పేద వర్గాల పిల్లల్లో పోషకాహార లోపం ఎక్కువగా కనిపిస్తుందన్నారు. ప్రభుత్వం చిన్నారుల్లో పోషకాహార లోపం నివారణకు అంగన్‌వాడీ కేంద్రాల్లో మంచి పౌష్టికాహారం అందిస్తోందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అవసరమైన వారికి మాశిలామణి ఉచితంగా మందులు అందజేశారు. పోషకాహార లోపం తీవ్రంగా ఉన్న ముగ్గురు చిన్నారులను నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల డీడీఓ రూస్సీ, ఇతర వైద్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

వరికుంటపాడు: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని రెవెన్యూ కార్యాలయ సీనియర్ సహాయకురాలు రమాదేవి తెలిపారు. మండలంలోని తూర్పుబోయలమడుగులో మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలను అర్జీ రూపంలో అందజేస్తే పరిశీలించి తగు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ నాగరాజు, రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సులభరీతిలో బోధన చేయాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు

ఉదయగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభరీతిలో బోధన చేస్తూ గుణాత్మక విద్యనందించాలని ఎంఈఓ తోట శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మంగళవారం పట్టణంలోని దళితవాడ, బీసీ కాలనీలోని తెలుగు, ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలందించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించాలన్నారు. పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నాగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పక్కాగా జగనన్న సురక్ష

బిట్రగుంట: అర్హత ఉన్నా పథకాలకు నోచుకోని పేదలను గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించేలా అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని డ్వామా పీడీ వెంకట్రావు అన్నారు. బోగోలు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులు, సచివాలయాల సిబ్బందితో మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. డ్వామా పీడీ మాట్లాడుతూ జూలై 1 నుంచి ఆగస్ట్ 1వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ఎవరెవరికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి, ఎవరికి అందడం లేదనే అంశాలతో పాటు ప్రజలు చెప్పే సమస్యలు నమోదు చేయాలని సూచించారు. డివిజనల్ అభివృద్ధి అధికారిణి కనకదుర్గాభవాని మాట్లాడుతూ కార్యక్రమం తీరు తెన్నులను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కోనేరు స్థలంలో ఆక్రమణల తొలగింపు



కోనేరు ఆక్రమణ స్థలాన్ని తొలగించి హద్దురాళ్లు ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

జలదంకి: మండలంలోని చామదలలో కోనేరు స్థలంలో ఉన్న ఆక్రమణలను మంగళవారం అధికారులు తొలగించారు. ఆక్రమణదారులు అడ్డుకోవడంతో భారీగా పోలీసు బందోబస్తు మధ్య తహసీల్దార్ పద్మావతి, ఎస్సై వీరేంద్రబాబు కోనేరు ఆక్రమణ స్థలాన్ని తొలగించి హద్దురాళ్లు నాటించి ఇనుప కంచె వేయించారు. 40 ఏళ్ల నుంచి తమ అధీనంలో స్థలాలు ఉన్నాయని ఆక్రమణదారులు అధికారులకు విన్నవించుకున్నారు. అయితే అవి ప్రభుత్వానికి కావడంతో పైఅధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో దండోరా వేయించి తొలగిస్తున్నామని తెలియజేశారు. ఆక్రమణ తొలగింపును కావలి ఆర్డీఓ శీనానాయక్ పరిశీలించారు. మండల సర్వేయరు మస్తాన్‌బాషా స్థానిక సచివాలయ సర్వేయర్లతో కలిసి దగ్గరుండి హద్దురాళ్లకు గుర్తులు పెట్టారు. ఈ కార్యక్రమంలో కలిగిరి సర్కిల్ సీఐ ఫిరోజ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించండి

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పలువురు కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం సంతోషకర పరిణామమని, అయితే ప్రభుత్వం ప్రకటించిన కటాఫ్ తేదీలను కొంత మేర సవరించి పలువురు కాంట్రాక్ట్ లెక్చరర్ల మేలు జరిగేలా చూడాలని వారు కోరారు. మంగళవారం ఆత్మకూరులో పలువురు కాంట్రాక్ట్ లెక్చరర్లు టెంకాయతోపులోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించారు. విలేకరులతో మాట్లాడుతూ 2014 జూన్ 2 తేదీ నాటికి పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల అందరిని రెగ్యులరైజ్ చేయాలని లేదా 2019లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన నాటికి ఐదేళ్ల సర్వీస్ పరిగణనలోకి తీసుకుని రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు పలువురు పాల్గొన్నారు.